**కథ**

# వినూత్న సంవత్సరం

''అత్తయ్యా! ఇవాళ సాయంత్రం సంజూ ప్రీతీలిద్దరూ స్కూలు నుండి డైరెక్టుగా అక్కడికి వస్తారు. ఆటో అతనితో చెప్పాను- అక్కడ దింపమని. నేనూ, మీ అబ్బాయి ఆఫీసు నుండి ఇంటికెళ్ళి, కాస్త రిఫ్రెష్ అయి వస్తాం''

సుజన ఫోన్లో అంటున్న మాటల్ని అర్థం చేసుకోవడానికా అన్నట్లు- అలా చెవులు అప్పగించి వింటున్న భార్యకేసి విస్మయంగా చూశాడు ఆనందరావు.

''అలాగే సుజనా! మరి పిల్లల బట్టలూ-అవీ...''

సుందరమ్మ మాటలకి, అవతల వేపునుండి ఏం సమాధానం వచ్చిందో- ఆనందరావుకి అర్థం కాలేదు. సుందరమ్మ ఫోన్ క్రెడిల్ చేసి, భర్త దగ్గరికి వచ్చి కూచుంది. ఆమె ముఖంలో ఆశ్చర్యం, అపనమ్మకం పోటీ పడుతున్నాయ్.

''ఇంతకీ నీ కోడలు ఏమంటున్నది సుందరీ? పిల్లలు ఈరోజు ఇక్కడే మనతో ఉండిపోతారటనా! ఔన్లే- న్యూ యియర్ ఈవ్ కదా... వాళ్ళే స్టార్ హోటల్కో వెళ్తారు. పిల్లల్ని వాళ్ళతో తీసికెళ్ళడం ఇష్టంలేదు కాబోలు!''

''అయ్యోరామ! అది కాదండీ! పిల్లలే కాదట- అబ్బాయీ, కోడలూ కూడా సాయంత్రం ఇక్కడికే వస్తారట'' అంది సుందరమ్మ.

''ఏమిటీ! ఈ ముసలివాళ్ళతో న్యూ యియర్ స్పెండ్ చేస్తారా! అటువంటి పిచ్చి ఆశలేవీ పెట్టుకోకు సుందరీ!'' అన్నాడు ఆనందరావు.

''సర్లెండీ... ఆ సంగతి తర్వాత చూద్దాం. ముందు పిల్లలు వచ్చాక వాళ్ళకేదయినా తినడానికి పెట్టాలి కదా- అది ఆలోచించాలి'' అంటూ, హడావిడిగా లోపలికెళ్ళిపోయింది సుందరమ్మ.

కొడుకు, కోడలు టూర్ల మీద వెళ్ళేటప్పుడో, ఆఫీసు డిన్నర్లు అటెండ్ అవాల్సి వచ్చినప్పుడో, పిల్లల్ని తాతగారింట్లో వుంచేయడం వాళ్ళకి అలవాటే. అలా పిల్లలు వస్తే- ఇక తాతా, నాన్నమ్మలకు పండగే పండగ. పిల్లలెంత అల్లరిచేస్తే పెద్దలకంత సంబరం.

సంజూ ప్రీతులు వచ్చీరాగానే డ్రెస్ మార్చుకొని, నాన్నమ్మ వేడిగా తయారుచేసిన పూరీ-కూరా తింటూ, తాతగారితో కబుర్లలో పడిపోయారు. సంజూ అయితే తను పాల్గొంటున్న క్విజ్ని గురించి తాతగారితో డిస్కస్ చేయడం మొదలెట్టాడు. వాడు చదువులోనే కాదు, విద్యేతర విషయాల్లో కూడా ఫస్టే. ప్రీతికి చదువుకన్నా డ్యాన్స్ అంటే ఇష్టం. అమ్మాయిలు చాలామంది చెస్ పట్ల ఆసక్తి కనపరుస్తుండడంతో తనక్కూడా చెస్ నేర్పమని తాత వెంటపడేది. మనవల ఇద్దర్నీ- అలా సందడిగా చూస్తే సుందరమ్మకు కడుపునిండినంత పనయ్యింది.

''ఏంటో కిశోర్, సుజన ఆఫీసు క్వార్టర్స్ అంటూ వెళ్ళిపోయారు కానీ, తమతో కల్సివుంటే ఎంత బాగుండేది! ఇప్పటి ఈ సంతోషం ఇంకెంత సేపు. వాళ్ళ అమ్మానాన్నలు రాగానే- బాయ్ నాన్నమ్మా! బాయ్ తాతగారూ! అంటూ పసివాళ్ళు వెళ్ళిపోతారు'' నిట్టూర్చింది సుందరమ్మ.

కిశోర్, కార్ పార్క్ చేసి వచ్చేలోగా, రెండు చేతులనిండా ప్యాకెట్లతో, గాలి దుమారంలా లోపలికొచ్చిన సుజన, ''సంజూ! వెళ్ళు- మీ డాడీకి కాస్త సాయం చెయ్, కార్లో ఇంకా ప్యాకెట్లున్నాయ్-అత్తయ్యా! వీటిని లోపల పెట్టివస్తాను'' అంటూ సమాధానం కోసం కూడా వెయిట్ చెయ్యకుండా కిచెన్లోకి దూసుకుపోయింది.

కిశోర్ ''బాగున్నారా నాన్నా!'' అంటూ నాన్నని, ఒక చిరునవ్వుతో అమ్మని పలకరించి, తనూ కిచెన్లోకి వెళ్ళాడు, ఏవో ప్యాకెట్లతో.

పెద్దవాళ్ళిద్దరూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. బహుశా న్యూ యియర్ ఇక్కడే సెలబ్రేట్ చేసుకుంటారేమో! వాళ్ళ ఫ్రెండ్స్ని కూడా ఇక్కడికే ఆహ్వానించారేమో!

పెద్దవాళ్ళ మనోభావాలకు విఘ్నం కల్గిస్తూ, సుజనా, కిశోర్-''అమ్మయ్యా!'' అంటూ వచ్చి డ్రాయింగ్ రూం సోఫాల్లో కూచున్నారు.

''అత్తయ్యా! బ్రెడ్, జామ్, పొటాటో చిప్స్, స్నాక్స్ అన్నీ తెచ్చాం. మీరు మాత్రం మీ అబ్బాయి కిష్టమయిన పులిహోరా, సేమ్యాపాయసం చెయ్యండి. ఫ్రయిడ్ రైస్ మిక్సిడ్ వెజిటబుల్ కుర్మా, పాలక్ పన్నీర్-నేను చేస్తాను'' అంది సుజన సుందరమ్మతో.

ఆనందరావ్ ప్రశ్నార్థకంగా చూశాడు కిశోర్ కేసి.

''ఔను నాన్నగారూ! ప్రతి సంవత్సరం ఆ స్టార్ హోటల్ తిండి తిని విసుగొచ్చింది. అందుకని ఈరోజు ఇక్కడే స్పెండ్ చెయ్యాలనుకున్నాం'' అన్నాడు.

'ఇక నీకు తప్పదులే చాకిరీ' అన్నట్లు భార్యకేసి చూశాడు ఆనందరావు.

''సుజనా! ఎంతమందికి చెయ్యాలమ్మా!'' అంది సుందరమ్మ-ఎలాగు తప్పదు కనక పని మొదలెట్టే మంచిదన్నట్లు.


''ఎంత అత్తయ్యా! ఓ పాతికమందికి. పేపర్ ప్లేట్లూ, నేప్కిన్స్, డిస్పోజబుల్ గ్లాసులు- తెచ్చాం. కాస్త, ఇల్లు సర్దుతాను. ఇప్పటి నుండే ఎందుకులెండి వంట. ఎనిమిది గంటలకు మొదలెడదాం'' అంటూ సోఫాలూ, కుర్చీలూ, సర్దుతూ టేబిల్ని ఓ వేపునకు షిఫ్ట్ చెయ్యడం మొదలెట్టింది సుజన.

కొడుకు, కోడలు, మనవలు ఇల్లంతా నీట్గా సర్ది, రంగురంగుల బెలూన్లు, కలర్ కాగితాలు కట్టి వెల్కమ్ టు న్యూ యిర్- 2002- అన్న బంగారు వన్నె బ్యానర్తో హాలుని అలంకరించారు.

మధ్య మధ్య- వంటింట్లోకి పరుగెడుతూ-సుజన వంటంతా తనే చేసింది. ఇల్లంతా సంబరంగా వుండడం ఆనందరావుకి బాగానే అన్పించింది. కానీ, రాబోయే గెస్టులని తల్చుకుంటేనే ఒళ్ళు జలదరించింది. కేకలు, అరుపులు, అర్థంపర్థంలేని సంభాషణలు, హోరెత్తించే హైటెక్ స్టీరియో సౌండ్లు-వెట్పార్టీ కూడా యాడ్ అయిందా-ఇక చెప్పనే అక్కర్లేదు- ఏం చేయాలో పాలుపోక ఓ పక్క కూచుండిపోయాడు ఆనందరావు. అయినా, ఈ పార్టీ ఏదో వాళ్ళ క్వార్టర్స్లో పెట్టుకోక-ఇక్కడెందుకు అరేంజ్ చేసినట్లో! ఆనందరావుకి అసహనంగానూ, చెప్పొద్దూ-కొంచెం కోపంగానూ వుంది. కానీ భార్య కూడా వాళ్ళతో సహకరించడంతో ఏమనలేక, మౌనంగా వుండిపోయాడు.

''తొమ్మిదయింది అత్తయ్యా! మీరు కాస్త తలా అదీ దువ్వుకొని, బట్టలు మార్చుకోండి. ఫ్రయిడ్ రైస్ నేనే దింపుతానులెండి!'' అంటూ సుందరమ్మని తొందర చేసింది సుమన.

''నా డ్రస్సింగ్కేం తొందరమ్మా!'' అంటూనే తన గదిలోకి వెళ్ళిపోయింది సుందరమ్మ. జిడ్డోడుతూ, పాతచీరలో వున్న తనని-వంట మనిషి అని అనుకుంటారేమో తన ఫ్రెండ్స్- అన్న భయం కాబోలు కోడలికి. నవ్వుకుంటూనే స్నానం చేసి, ఉల్లిపాయరంగు కంచిపట్టుచీర కట్టుకొని తయారై వచ్చింది. ఆనందరావు కూడా బట్టలు మార్చుకొని కూచున్నాడు. పిల్లలకి సుజన వేరే డ్రెస్సు తెచ్చినట్లుంది- వాళ్ళు కూడా నీట్గా తయారయిపోయారు.



సుజన కూడా స్నానం చేసి, నేవీ బ్లూ కలర్ షల్వార్ కమీజ్ వేసుకొని క్రాకరీ అంతా టేబిల్ మీద సర్దింది. వాటర్ ఫిల్టర్, గ్లాసులు సపరేట్ టీపాయ్‌మీద వుంచింది. ఆనందరావు, సుందరమ్మ ప్రేక్షకుల్లాగ- జరిగే తతంగమంతా చూస్తూ వుండిపోయారు. టీవీ రిమోట్ అటూ ఇటూ నొక్కుతూ ఆనందరావుతో తన ఆఫీసు కబుర్లలో పడిపోయాడు, కిశోర్.

సరిగ్గా పది గంటలకి వెంట వెంటనే కార్లు రావడం మొదలయింది. డోర్ బెల్ చప్పుడుకి కిశోర్ వెళ్ళి తలుపు తెరిచాడు.

''రండంకుల్... రండాంటీ''

అంకుల్- ఆంటీ అంటాడేంటి సుపుత్రుడు అనుకొని ఎటో నిరాసక్తంగా చూస్తున్న ఆనందరావు, తన బాల్యమిత్రుడు, తన సహవాసి అయిన రాఘవని చూడడంతో-

''అరే నువ్వా రాఘవా!'' అంటూ గబగబా లేచి ఎదురెళ్ళాడు.

''నేనొక్కడినే కాదు ఆనందరావ్- నా భార్య కూడా వచ్చింది!'' అన్నాడు సంతోషంగా.

''సుందరీ! ఎవరొచ్చారో చూడు!'' అన్నాడు ఆనందరావు భార్యవేపు చూస్తూ ''రండి... రండి'' అంటూ ఆప్యాయంగా పలకరించింది సుందరమ్మ. రాఘవ భార్య కౌసల్య, సుందరమ్మ ప్రక్కనే కూచుంటూ మాటల్లో పడింది.


''అదేంటి రాఘవా! మాటమాత్రం చెప్పలేదు నువ్వొస్తున్నట్లు...'' అన్నాడు ఆనందరావ్, స్నేహితుడి భుజం మీద చేతులేస్తూ.

కిశోర్‌కేసి అర్థవంతంగా నవ్వి, ''నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని ఆనందం'' అన్నాడు రాఘవ.

''అయితే చెస్ ఒక ఆటవేద్దామేంటి?'' అన్నాడు ఆనందరావు. మాట పూర్తికాకుండానే మళ్ళీ బెల్ మ్రోగింది. ఈ తడవ వచ్చింది సుందరమ్మ చెల్లెలు కుముద, ఆవిడ భర్త నారాయణరావు. ఎక్కడి జీడిమెట్ల! ఎక్కడి మహేంద్రాహిల్స్! రావాలంటేనే ఒక వూరి ప్రయాణమంత. ఇలా చెల్లెలూ, మరిది అనుకోకుండా రావడం వల్ల సుందరమ్మకి చెప్పలేనంత సంతోషమేసింది. హాపీగా ఈ సాయంత్రం గడిపేయవచ్చు. ఎటొచ్చీ, సుజనా, కిశోర్ వాళ్ళ కొలీగ్స్ వస్తే- మా ముసలి వాసన వాళ్ళకి పడ్తుందో లేదో అన్పించింది సుందరమ్మకి. ఇంకాస్సేపటికి ఆనందరావు మార్నింగ్‌వాక్ ఫ్రెండ్స్ రామారావ్, కృష్ణమూర్తీ కూడా వచ్చారు. ఇలా ఇల్లంతా పెద్దవాళ్ళతో నిండిపోవడంతో కొంత ఇబ్బందిగా ఫీల్ అయ్యాడు ఆనందరావు.

కొడుక్కేసి చూశాడు ''ఇదేంటన్నట్లు!''

ఎమ్. హేమలత




కిశోర్ నవ్వుతూ ముఖం తిప్పుకున్నాడు. నిజానికి వీళ్ళలో ఎవరినీ తను పిలువలేదు. ఇదంతా కొడుకు-కోడలు నిర్వాకం అన్నమాట.

పది గంటలయ్యేసరికి ఆనందరావు మిత్రులు పదిమంది-సుందరమ్మ స్నేహితురాండ్రు అయిదుగురు-కొడుకు, కోడలు, పిల్లలతో ఇల్లంతా నిండిపోయింది.

''అత్తయ్యా! భోజనాలు కానిచ్చేదామా-పదయింది'' అంటూ వచ్చింది సుజన.

''అదేంటమ్మా! మీ ఫ్రెండ్స్ కూడా రానీ!'' అంది సుందరమ్మ, ఈ ఏర్పాట్లన్నీ వాళ్ళ కోసమేగా అని, మనసులో అనుకుంటూ.

''అదేంటత్తయ్యా! వీళ్ళందరూ మా ఫ్రెండ్స్ కారా?'' అంది నవ్వుతూ, సుజన.

''అంటే... అంటే'' అంటూ నీళ్ళు నములుతున్న అత్తయ్య దగ్గరికొచ్చింది సుజన.

''వీళ్ళందర్నీ మేమే పిలిచాం అత్తయ్యా! ఎప్పుడూ మా ఫ్రెండ్స్‌తో గడుపుతూనే వుంటాం. ఈరోజు వెరైటీగా మీతో, మీ ఫ్రెండ్స్‌తో స్పెండ్ చేయాలని నేనూ మీ అబ్బాయి ముందుగానే ప్లాన్ చేశాం. రండి- టేబిల్‌మీద అన్నీ సర్దాను. అంకుల్స్..ఆంటీస్..ప్లీజ్ కమ్'' అంటూ చిన్నపిల్లలాగా అరిచింది సుమన.

సంజూ, ప్రీతీ అప్పటికే-వడ్డించిన ప్లేట్స్ పట్టుకొని హాలంతా తిరుగుతూ, టీవీ చూస్తూ తినడం మొదలెట్టారు. ఆనందరావూ సుందరమ్మలు మొదట ఆశ్చర్యపోయినా తర్వాత ఆహూతులతో కలిసి తింటూ, కబుర్లలో పడిపోయారు. అందరి భోజనాలు అయి భుక్తాయాసంతో సోఫాల్లో కొందరు, కార్పెటు మీద కొందరు- అలా సెటిల్ అయిపోయారు. టీవీలో వచ్చే ప్రోగ్రాముల కన్నా ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకోవడం లోనే వాళ్ళకి ఎక్కువ ఆనందం కల్గింది.

సరిగ్గా పన్నెండు అవుతోందనగానే, సుజన గబగబా హాల్లోని లైట్లన్నీ ఆఫ్ చేసి టేబిల్ మీద ఒక పెద్ద క్యాండిల్ వెల్గించింది. అంతవరకు లోపల దాచిన కేక్ తెచ్చి టేబిల్ మీద పెట్టి ''అత్తయ్యా! మామయ్యా! మీరిద్దరూ రండి-కేక్ కట్ చేయాలి'' అంటూ పిల్చింది. ఆనందరావు, సుందరమ్మ కేక్ కట్ చేయగానే హ్యాపీ న్యూయర్ అంటూ చప్పట్లు కొడ్తూ కేకలు పెట్టారు.

అంతే ఇల్లంతా గోలగోలగా అయిపోయింది. పెద్దవాళ్ళ, నూతన సంవత్సర శుభాకాంక్షలతో, కరచాలనాలతో చప్పట్లతో ఇల్లు మార్మోగిపోయింది.

సుజన, కిశోర్‌లు పెద్దలందరికీ అభివాదాలు తెలియజేసి, కేక్ ముక్కలు అందించారు. కొడుకు, కోడలు అలా ప్రేమగా, గౌరవంగా అందర్నీ పలకరిస్తూ తిరుగుతూంటే ఆనందరావు కళ్ళు చెమర్చాయి. ఎంత సంతోషంగా మొదలయింది న్యూ యియర్, తన వాళ్ళ మధ్య! ఈ ఆనందం తమకందించిన కొడుకు, కోడలికేసి ప్రేమగా, ఆర్ద్రంగా చూశాడు ఆనందరావు. సుందరమ్మకయితే ఒళ్ళు తెలీడం లేదు ఆనందంతో. సుజనకి వాళ్ళందర్నీ చూస్తుంటే తనూ, తన భర్త ఆ ఉదయం తీసుకొన్న నిర్ణయం ఎంత అర్థవంతమయిందో అవగతమయింది.

డబ్బులు తగలేసి, స్టార్ హోటల్‌లో తెచ్చిపెట్టుకున్న మర్యాదలతో, కుహనా నాగరికతల మధ్య, లేనిపోని ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు నటిస్తూ- ఇష్టమున్నా లేకున్నా చిరునవ్వులు ఒలకపోసే ఆ పార్టీలకన్నా ఈ పార్టీ ఎంతో సంతోషాన్నిచ్చింది. ముఖ్యంగా తల్లిదండ్రుల వంటి అత్తయ్య మామయ్య ముఖాలలో ఎంతో శాంతిని, సంతృప్తిని చూడగల్గింది సుజన.

*



## సిమ్రాన్‌కి రజనీ ప్రశంసలు

**ఇటీవల కమలహాసన్ సరసన సిమ్రాన్ నటించిన 'పమ్మల్ కె సంబంధం' తమిళ చిత్రం ప్రీమియర్‌కి వచ్చిన రజనీకాంత్ సిమ్రాన్ నటన అద్భుతంగా వుందని ప్రశంసల వర్షం కురిపించాట్ట. దాంతో సిమ్రాన్ తెగ సంబరపడిపోయి, రజనీకాంత్ కొత్త సినిమాలో అవకాశం వస్తుందని కలలు కంటోందిట.**

**-శ్వేత**